# పటిక బెల్లం

"అమ్మా" అంటూ అర్జునరావు నోటివెంట ఆర్తిగావచ్చిన కేక పనిలో నిమగ్నమై ఉన్న అందరినీ ఉలిక్కిపడేట్టు చేసింది. ఆ ఆర్తనాదం అతని ఆప్తమిత్రుడైన కృష్ణమూర్తి అంతరంగాన్ని కదిలించింది. అర్జునరావు లీవు పూర్తయి ఆఫీసుకి వచ్చి వారం దాటింది. అర్జునరావు ఆఫీసుకు వచ్చాడు. అంటే అందరి అలసట

మరిపించేట్టు హుషారైన కబుర్లతో చల్లని స్నేహాన్ని పంచేవాడు. అలా అని పనికి మాత్రం ఎప్పుడూ వెనుతీయడు. తన పని తాను సక్రమంగా చేసుకుపోవడమే కాక మన విధి మనం జాగ్రత్తతో నిర్వర్తించాలని, ఆఫీసుపనికి స్వంతపనికి తేడా చూపకూడదని చుట్టు పక్కల వాళ్ల దగ్గరకు అలసత్వం చేరకుండా వెన్నుతడుతూనే ఉంటాడు.

అలాంటిది అర్జునరావు మూడు నెలలుగా ఆఫీసుకి రాకపోయేసరికి చంద్రుడులేని ఆకాశంలా నిండుదనాన్ని కోల్పోయింది. ఇప్పుడతను వస్తున్నా మునుపటి ఉత్సాహం, చలాకీతనం కరువై కళతప్పిన జాబిలిలా కనిపిస్తున్నాడు. అందుకు అందరికీ కాస్తంత ఆవేదన కలిగినా ఆప్తమిత్రుని మనఃస్థితి కృష్ణమూర్తి హృదయాన్ని మాత్రం పిండేస్తోంది. ఎంత అనునయించినా, ఎన్ని రీతులుగా ఓదార్చినా మిత్రుని మనోవ్యధను రవ్వంత కూడా మాయం చేయలేకపోతున్నాడు. గభాలున లేచి మిత్రుని దగ్గరకు వచ్చాడు.

"ఏరా నువ్వింకా అదే ధ్యానంలో ఉంటే ఎలారా, కష్టాలు వచ్చినప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలని మా అందరికి హితవచనాలు చెప్పేవాడివి. నువ్వే ఇలా దిగులుపడతావేమిటి? నిన్నిలా చూస్తుంటే నా మనస్సు చెదిరిపోతోంది. కాస్త మరచిపోడానికి ప్రయత్నించరా బాబూ. అయిపోయినదానికి మనం ఏం చెయ్యగలం చెప్పు. ఇక నువ్విలా నిస్పృహలతో కనిపించావంటే నేనూరుకోనురా. నువ్వెంత మనసు పాడుచేసుకున్నా ప్రయోజనం ఏముంది?" స్నేహితుని భుజాన చెయ్యివేశాడు కృష్ణమూర్తి. అప్పటికే తేరుకున్న అర్జునరావు తననే అందరూ గమనిస్తున్నారని బిడియంతో చిన్నబుచ్చుకున్నాడు.

"ఛ...ఛ. తనేమిటిలా! తనని ఎందుకు ఈ బలహీనత విడిచి పెట్టడం లేదు! ఇంకా తను ఇలానే ఉంటే కొలీగ్స్ పేళనలకి గురి కాక తప్పదు" ఆలోచిస్తూ నిస్తేజంగా కూర్చుండిపోయిన వాడు మిత్రుని చేయి పట్టుకొని లేచి నిలబడ్డాడు.

"కాఫీ తాగొద్దాం పదరా" అంటూ లేచి నిలబడ్డాడు. గుండెల్లో బరువు కళ్లల్లోకి జాలువారుతుంటే జేబులో కర్చీఫ్ చేతుల్లోకొచ్చి కళ్లకడ్డుపడింది.

"నీకు మెత్తగాచెప్తే లాభం లేదురా ! నాలుగు అంటించి నెత్తి కెక్కించాలి హితబోధ" ఆఫీసుగేటు దాటగానే అన్నాడు కృష్ణమూర్తి

"నేనూ అదే ఆలోచిస్తున్నానురా, నా నిగ్రహం ఎందుకు సడలి పోయిందో, నలుగురిముందు కూర్చున్నప్పుడు కూడా ఎందుకు, తమాయించుకోలేకుండా ఉన్నానో అంతుపట్టడం లేదు. అందుకోసం ఎంత ప్రయత్నించినా విఫలుడనె అవుతున్నాను. పోనీ మరికొంత కాలం సెలవు పొడిగించేద్దామంటే"

"అంతపని మాత్రం చెయ్యకు. అలా చేసావంటే నీ ఉద్యోగానికే ముప్పు. మన బాసు సామాన్యుడా? నీకు రావలసిన ప్రమోషన్ ఈ కారణంగానే ఆగిపోయింది. ఇకనైనా జాగ్రత్తపడరా. నెమ్మదిగా మీ అమ్మను మర్చిపోడానికి ప్రయత్నించు. పోయిన వాళ్ళతో పోగలమా. నువ్వు ఇలా దుఃఖపడుతూ ఉంటే అమ్మకి ఆత్మశాంతి ఎక్కడిది? ఎప్పటిలా నువ్వు చెదరని చిరునవ్వుతో ఉల్లాసంగా ఉంటేనే పైలోకానికి వెళ్ళిపోయిన అమ్మ ఆత్మ సంతోషిస్తుందిరా" కాఫీ తీసుకున్నంతసేపూ కృష్ణమూర్తి ఇలాటి మాటలు అర్జునరావు చెవుల్లో వేస్తూనే ఉన్నాడు. తిరిగి ఆఫీసుకి వచ్చాక ఎవరి పనిలో వాళ్ళు నిమగ్నమైపోయారు.

గడియారం ఐదు గంటలు కొట్టి ఆఫీసుపని పూర్తిఅయ్యేంత వరకూ అర్జునరావు ప్రశాంతంగానే ఉండగలిగాడు. ఇంటిముఖం పట్టేసరికి మాత్రం మాతృమూర్తి స్మృతులతో మళ్ళీ భారం అయిపోయింది అతని మనస్సు. గీతోపదేశం చేస్తున్న శ్రీకృష్ణునిలా అతని నెచ్చెలికాడు కృష్ణమూర్తి గుర్తుకొచ్చాడు కానీ వాడు చెప్పినట్టు అమ్మ తలపులకు దూరమై జీవించగలగడం సాధ్యమా? "అమ్మ" ఎంత కమ్మని పదం. అది సృష్టిలో ప్రతిజీవికి తొలిబంధం. కడుపులో దాచుకుని ప్రసవవేదన కోర్చి మృత్యువుతో పోరాడి జన్మనిస్తుంది. పొత్తిళ్ళలో పొదుగుకొని పెంచటం మొదలు బిడ్డలే తన జీవిత సర్వస్వంగా భావిస్తుంది. తన బిడ్డల ఉన్నతే పరమార్థంగా భావించే జననికి సరిసాటి ఎవరు?"

అర్జునరావు మస్తిష్కంలో ఇవే ఆలోచనలు. గేటు తీసుకుని ఇంట్లోకి అడుగుపెడుతున్న అతనికి బిగ్గరగా వినిపిస్తోంది భార్య కంఠం.

అనుశృతంగా బుజ్జిగాడి ఏడుపు.

"బ్రతికినంతకాలం ఆ మహాతల్లి నన్ను ఏడిపించుకుతింది. చచ్చి ఇంటిని రావణకాష్ఠం చేసింది. నాన్నమ్మా, నానమ్మా అని పొద్దస్తమానం ఏడవకపోతే దానితోనే చావకపోయావా?"

ఛళ్లున బుజ్జిగాడి వీపుమీద చరిచింది. వాడు మరింత శృతి పెంచాడు. "నోర్మూయ్ వెధవా మళ్ళీ ఆవిడగార్ని తల్చావంటే ఏం చేస్తానో చూడు. ఇవాల్టి పరీక్ష ఎలానూ తగలేశావ్. రెండు రోజులుంది గనుక సోమవారంనాటి పరీక్ష అయినా బాగా రాయి. ముందా ఏడుపు కట్టిపెట్టి పుస్తకం పట్టు".

కసితీరా మరో దెబ్బవేసి మరీ వంటింట్లోకి వెళ్ళింది సుభద్ర. భార్య చర్యకి ఖిన్నుడైన అర్జునరావు తలపట్టుకుని కుర్చీలో ఒరిగి పోయాడు.

"ఏమిటి అమ్మడూ అలా పిల్లాడిని పట్టుకుని బాదేస్తున్నావ్?" పెరటి గుమ్మంలోంచి వంటింట్లోకి చొరబడ్డారు పొరుగింటి భానుమతమ్మగారు.

"చూడండి పిన్నిగారూ, మా అత్తగారు చచ్చి నెల దాటిందా ఈ కుర్రకుంక ఇంకా ఆ మహాతల్లి నామస్మరణే. మరో మాటా? పలుకా? చదువుసంధ్య కూడా మాని తగలడుతున్నాడు. అవ్వ ఇంతతున్నాడో లేదో ఆటపాట కూడా లేకుండా నాన్నమ్మకోసం ఏడుస్తూ కూర్చోడం విడ్డూరమే సుమ్మీ. మునపటిలా బడి వదలగానే మీ మనవలతో ఆడు కోవడానికి వెళ్ళడమే మానేసాడు. ఆటమాట అటుంచండి ఈవాళేం ఘనకార్యం చేశాడోచూశారా పరీక్షకి వెళ్ళమంటే పాపం ఎప్పుడూ వాళ్ళ నాన్నమ్మ సాగనంపేదిట ఆవిడ చచ్చిందిగా ఫోటోకి దండం పెట్టి గుడ్ల నీళ్లు కుక్కుకుని నిలబడ్డాడు. చిన్నపిల్లాడు కదా సరే అని బుజ్జగించి పంపాను. తీరా అక్కడ పరీక్ష పేపర్ చేతుల్లోఉంచుకుని ఏడుస్తూ కూర్చున్నాడట. మన ఎదురింటి జానకమ్మగారి పాప ఒకటే చెప్పటం. ఇలా అయితే పిల్లాణ్ణి బడికి పంపొద్దందిట టీచరు. మీరే చెప్పండి పిన్నిగారూ ఒళ్ళుమండదూ మరి. నా ఒళ్లుమండి వాడి ఒళ్ళు హూనం చేశాను".

"ఔనులే తల్లీ నువ్వుమాత్రం ఏంచేస్తావ్? నీ మొగుడి వాలకం కూడా చూస్తూనే ఉన్నానుగా. దుఃఖపడుతున్న ముఖం, పరధ్యానం, మీ ఇంటికి ప్రేతకళొచ్చేసిందే తల్లీ! అయినా కొన్నిజీవులు వాటి మానాన అవిపోక వెంట మరోప్రాణాన్ని పట్టుకుపోతాయి. అలాంటి

పిండంలా ఉంది మీ అత్తగారు" నోటికి ఎంత వస్తే అంత వాగేస్తోం ధావిడ.

"అంతా నా ఖర్మ పిన్నిగారూ. ఆయనగారి నిర్వాకం ఇంట్లో పెళ్ళాం ఒకర్తి ఉందనే ధ్యాసఉంటేనా, అమ్మా, అమ్మా అంటూ కొంగట్టుకు తిరిగారు. పిల్లాడి సంగతి వేరేచెప్పాలా? ముఖంకడిగి పాలు త్రాగించడం మొదలు రాత్రి నిద్రపుచ్చడం వరకు నాన్నమ్మే ఉండాలి వాడికి. అందుకే ఇవ్వాళ ఘోరిస్తున్నాడు".

ఆ సంభాషణ అర్జునరావుని మరింతగా కలవర పెట్టింది. ఏమిటీ సుభద్ర మరీ ఇంత నిష్ఠూరంగా మాట్లాడుతుంది. ఇంతకీ తనేం చేసాడని? తనమీదే ప్రాణాలు పెట్టుకొని బ్రతుకుతున్న తల్లితో కాస్సేపు మాట్లాడటం తన దినచర్యలో ఓ భాగం అనుకోడం తప్ప భార్యని అలక్ష్యం చేయలేదుగా, ఖర్మ సుభద్రది కాదు. తనదే, తన అర్ధాంగి మనస్తత్వమే విచిత్రం. అర్జునరావు లేని ఓపిక తెచ్చుకుని లేచి బుజ్జిగాడి దగ్గరకు వెళ్ళాడు. భయంగా పుస్తకం పట్టుకున్నాడే కానీ నాలుగు వాక్యాలైనా చదవలేకపోతున్నాడు బుజ్జి. బడి నుంచి రాగానే పాలు, ఫలహారాలతో ఆకలి తీర్చకపోగా తల్లి దండించడం ఆ లేత మనస్సుని మరింతగా బెదరగొట్టింది.

"ఏరా నాన్నా పరీక్ష వ్రాయకుండా వచ్చేసావా తప్పుకదూ, నాన్నమ్మ నీతో ఏమనేదిరా? బాగాచదువుకుని ఎప్పుడూ ఫస్టుర్యాంకు తెచ్చుకోవాలనేదికాదూ" కొడుకుని దగ్గిరికి తీసుకున్నాడు. తండ్రి నాన్నమ్మ అనేసరికి బుజ్జిగాడికి మరింతగా దుఃఖం పొంగి వచ్చింది. తండ్రి ఒళ్ళో తలదాచుకుని వెక్కివెక్కి ఏడుస్తూ "మరీ, మరి నేను పరీక్షలు వ్రాయలేను నాన్నా. అసలు బడికివెళ్ళను నాకు నాన్నమ్మ" మనస్సులో మాట చెప్పేలోగానే రివ్వున దూసుకొచ్చింది సుభద్ర. ఆమె కంఠంలో మళ్ళీ ఉరుముల మ్రోత.

"చాల్లెండి మీ మూలాన్నే వాడిలా తయారవుతున్నాడు. బుద్ధి రావాలని ఓ దెబ్బ వేసానోలేదో ఊఁ ఇదయిపోతున్నారు. ఆ దిక్కులేని ముసల్డి చచ్చి నెలదాటినా ఇవాళే పీనుగు పోయినట్టు తండ్రి, కొడుకు ఏమిటి ఏడుపు ముఖాలు?"

"సుభద్రా ఏమిటంటున్నావే, మాటలు సరిగ్గారానీ బ్రతికున్నన్నాళ్లూ అత్తగారిని ఎలాగూ అభిమానించలేకపోయావే ఇప్పుడూ ఆడిపోసుకుంటావెందుకు?"

"ఓసోసి ఆవిడ మహా నన్ను ప్రేమగా చూసుకుంది. కోడలు అన్న మురిపం ఉండేడిసిందేవిటి మీ అమ్మకి. ఎప్పుడూ ఆవిడిగారితో ఏదో గొడవే" చేతులూపుతూ కళ్ళు తిప్పుతూ అక్కసుగా అంది.

"చూడు సుభద్రా, జగడాలు, రగడలు అన్నీ నువ్వు రేపినవే. కోడలన్న మురిపం లేదంటున్నావే అమ్మ నీకేం తక్కువ చేసింది? నువ్వు నెలతప్పితే ప్రతిరోజూ ఓ పండగ చేసేది. నిన్ను కాలుకింద పెట్టనిచ్చిందా. పిల్లాణ్ణి నువ్వు విసుక్కుంటే రాత్రులైనా నిద్రమాని ఎత్తుకు తిరిగింది. మనం సినిమాలకి, షికార్లకి వెళితే నువ్వు ఫ్రెండ్సంటూ, పార్టీలంటూ పిల్లల్ని వదిలేసి తిరిగినప్పుడు వాళ్ళని కంటికి రెప్పలా చూసుకుంది. వాళ్ళు నాన్నమ్మకు చేరికకాక ఏమవుతారు?"

"ఔనౌను. ఆవిడే పెంచింది పిల్లల్ని. అంటారులెండి మొగ్గ ఎటువైపుంటే అటే తూగుతుంది త్రాసు. పెళ్ళాంకన్నా చచ్చిన మీ అమ్మే మీకు ఎక్కువ".

"మొగ్గుకాదు సుభద్రా, నిజానికి నీకోపతాపాలన్నీ మా అమ్మ

కనుక భరించింది. ప్రతి నిత్యం ఏదో ఓలా సాధించేదానివి. అమ్మ నేం సుఖపెట్టాం" అతని గొంతు గాద్గదికమైంది. "మన ఆనందమే తన సంతోషంగా భావించిన దేవతామూర్తి అమ్మ".

"ఆహా అమ్మ దేవతైతే అలి దెయ్యంకాబోలు. ఆ దేవతామూర్తి అమృతం తాగి బ్రతకలేదు. ముప్పొద్దులూ మెక్కి కాలుమీదకాలేసు కొనే కూర్చుంది. ఆవిడ ఇష్టానుసారమే అన్నీ జరిపించుకుంది. నేనేమైనా నోరెత్తితే మీకు తప్పుగా తోచేది. ఇంటి పెత్తనం చెలాయించకపోలేదావిడ. చచ్చాక కూడా పట్టుకు వేళ్ళాడుతున్నారు. ఆ దేవతామూర్తినే స్మరిస్తూ కూర్చోండి తండ్రీ, కొడుకూ. వాడు బడి మానేస్తాడు. మీరు ఆఫీసు మానేయండి" వెటకరించి విసవిసా వెళ్ళిపోయింది.

అమ్మ మరణానికి ఇంతగా ఆవేదన పడుతున్నది తనొక్కడే కాదన్నమాట. బుజ్జిగాడి మనస్సెంత నలిగిపోతోందో తను గమనించలేదు. తన మాట అటుంచి పసివాడి మనస్సుకి తగిలిన గాయాన్ని మాన్పే ప్రయత్నంలో పడాలి. సుభద్ర వాణ్ణి ఊరడించకపోగా శాపనార్థాలతో, చెయ్యివాటుతనంతో బెదిరిపోయేట్టు ప్రవర్తిస్తోంది. నాన్నమ్మ ఒళ్ళోనే కళ్ళుతెరిచి ఆ చేతుల్లోనే పెరిగిన బుజ్జిగాడికి హఠాత్తుగా నాన్నమ్మ దూరంకావడం తట్టుకోలేని షాకేమరి. నెమ్మదిగా అనునయించి వాడి చిన్నిబుర్రకి అర్థం ఆయ్యేట్టు నచ్చచెప్పాలి. సుభద్రకంటే ఓర్మితో, లాలనగా, గారాబంగా పెంచింది మరి. వాడు మరో ధ్యానం లేకుండా తలపోస్తున్నాడంటే ఆశ్చర్యమేముంది? అమ్మ జబ్బుపడినప్పుడే ఆ బెంగలో వాడు సగం అయిపోయాడు.

"అమ్మా నాన్నమ్మెప్పుడు ఆస్పత్రినుంచి నా దగ్గరికొచ్చేస్తుంది.

స్నానం చేయించి అన్నం తినిపించి బోలెడు కథలెప్పుడు చెప్తుంది? జోకొడుతూ పాటెప్పుడు పాడుతుంది? గోముగా అడిగే వాడు. సుభద్ర ఖస్సుమని లేచేది. "వేలెడు లేవు నేను చేయడం లేదా ఈ పనులన్నీ. అవిడే కావల్సొచ్చిందా?" కసురుకునేది. భగవంతుని దయవల్ల తల్లి ఆరోగ్యం కుదుటపడ్డప్పుడు బుజ్జిగాడి సంబరం అంబరాన్నంటింది.

"నాన్నమ్మా నువ్వు లేకపోతే నాకసలేమీ, బాగుండలేదు. అమ్మ, నాన్న అందరూ ఉన్న ఒక్కణ్ణి ఉన్నట్టు అనిపించింది. నువ్వింకెప్పుడూ అస్పత్రికి వెళ్ళకూడదని నాతోనే ఉండాలని అందరు దేముళ్ళకీ చెప్పాను. నీకు మరి జ్వరం రాదు నాన్నమ్మ" ఎంతో అమాయకంగా అన్నాడు.

బుజ్జిగాడి మాట మనస్సుకి నాటుకునేనేమో మళ్ళీ జబ్బు తిరగబెట్టినా వాణ్ణి ఒదిలి హాస్పటల్‌లో ఉండటానికి ఒప్పుకోలేదు అమ్మ. ఏదేవుడూ పసివాడి మొర వినలేదు. వాడి నాన్నమ్మని కూడా వాళ్ళల్లోనే కలిపేసుకున్నారు.

సుభద్ర రాకతో అతని అలోచనలు తెగిపోయాయి. "చెప్పటం మరిచాను. మధ్యాహ్నం సిద్ధాంతిగారొచ్చారు".

"ఏమన్నారు సరస్వతిని తీసుకురావడానికి ముహూర్తం ఎప్పుడట".

"అదేనండీ మీరు రాగానే చెప్దామనుకున్నాను. ఈ రాత్రి ట్రైన్‌కే బయల్దేరి రేపే అమ్మాయిని తీసుకొచ్చెయ్యమన్నారు. దాటితే తొందరలో మంచి ముహూర్తాలు లేవట".

"సరే సుభద్రా ఇప్పుడే బయల్దేరుతాను" మనసులో అలజడిని

తవ్వంత వెనక్కి వెడుతూ కూతురిరూపం నిండుగా కళ్లల్లో మెదులు తూంటే సరస్వతి అత్తింటికి బయలుదేరాడు అర్జునరావు.

తండ్రిని చూస్తూనే ఒక్క పరుగున ఆప్యాయంగా దగ్గరి కొచ్చింది సరస్వతి.

"మరీ ఇలా అయిపోయారేం నాన్నా. నాన్నమ్మ గురించి దిగులే"

"ఏంలేదమ్మా" తనలోని బాధని దాచుకోవడానికి ప్రయత్నిం చాడు.

"ఏం లేదంటారేం నాన్నా. నాన్నమ్మ అందరినీ ఎంత ప్రేమించేది. తొందరలో మరచిపోవడం కష్టమేమరి. "నాకూ క్షణం క్షణం నాన్నమ్మే గుర్తొస్తోంది. నాకు నెలతప్పిందని పొంగిపోయి ఎంత మురిపెం చేసుండేదో".

"మన మాటకేమమ్మా బుజ్జిగాడైతే ఏ లోకంలో ఉంటున్నాడో వాడి సంగతే అంతుపట్టడం లేదు. చదువుకోడు. ఆటధ్యాసే లేదు. ఇక తిండితిప్పలసలే మానేశాడు. ఏమౌతాడో బెంగపట్టుకుంది".

తమ్ముడు చదువుకోటం లేదన్నమాటే సరస్వతిని ఎక్కువగా ఆశ్చర్యపరిచింది. బుజ్జిగాడికి చదువే పంచప్రాణాలూ. స్కూలులో వేసినప్పటి నుంచీ ఫస్టు ర్యాంకు వాడిదే. పుస్తకాలు ముందేసుకుని ప్రపంచాన్నే మరిచిపోయే బుజ్జి, నాన్నమ్మని మరిచిపోలేక చదువే మానేసాడంటే" నిట్టూర్చింది.

ఇక తను వెడుతోందిగా. వాడ్ని దగ్గర చేసుకుని ఓదార్చి వాడు తేరుకునేట్టు చేయగలదు. అలా గట్టిగా అనుకుంటే తప్ప ఆమె మనసు కుదుటపడలేదు.

"ఎవరమ్మా సరూ వచ్చింది? వంటింట్లోంచి సరాసరి వీధి వరండాలోకి వస్తూ అంది సరస్వతి అత్తగారు.

అర్జునరావును చూస్తూనే "రండి అన్నయ్యగారూ అలా నిలబడి పోయారేం''.

''ఏవమ్మా కోడలుపిల్లా నాన్నగారొస్తే లోపలికి రమ్మని స్నానపానాలు చూడాలికాని ఇదేంపని?"

"అతిథి మర్యాదలు అతిగానే చేస్తారు లెండిమీరు. అయినా నాకేం కొత్తా? నిజానికి మేమెంతో అదృష్టవంతులం కనుకనే నా తల్లి ఈ ఇంటి కోడలైంది'' అంటూ కుర్చీలో కూర్చున్నాడు.

ఇద్దరూ మాటల్లో పడ్డారు. అర్జునరావు తల్లిపోయిన బాధ తట్టు కోలేకపోతున్నాడని ఆవిడ గ్రహించింది.

''కొంతకాలం అలానే ఉంటుంది అన్నయ్యగారూ. పెద్దవాళ్ళు ఉన్న ఇల్లు ఓ దేవాలయం. అభిమానంతో చూస్తే ఇంట్లో అందరూ ఆ పెద్దల వాత్సల్యాన్ని పొందుతారు. వాళ్ళు వెళ్ళిపోయాక ఆవెలితి తీరేదికాదు మరి''.

ఆవిడ అలా అంటుంటే అర్జునరావు కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. ఈ మోస్తరు భావనే సుభద్రకి ఉంటే బుజ్జిగాడి స్థితి ఇలాఉండేదా? తను ఇంత మథనపడవలసి వచ్చేదా?

కాఫీ కప్పులతో అక్కడికి వచ్చింది సరస్వతి.

"మీ నాన్నగారికివ్వమ్మా ఇప్పుడు నాకెందుకు'' కోడలు అభి మానంతో తనకి కాఫీ అందిస్తుంటే వాత్సల్యంగా వారించింది.

"ఇంకా వంటకాలేదుగా అత్తయ్యా. అందుకే మీకు కలిపాను"

"వంట బెడద ఈ పూట నువ్వు పెట్టుకోకు. వెంటనే బయలు దేరాలిగా. ఆ పని నేను చూస్తాను కానీ, నువ్వు సామాన్లు సర్దుకో" కాఫీ కప్పు అందుకుంటూ అన్నారావిడ.

అత్తగారి మాటకి తెగ సంబరపడిపోయింది సరస్వతి. ఉత్సాహంగా సామాన్లు సర్దుకుంటూ ప్రయాణ సన్నాహంలో పడిపోయింది. పుట్టబోయే చిట్టిపాప మూలాన తనో ఆరునెలలు అమ్మానాన్నలతో గడుపుతుంది. పెళ్ళయ్యాక పట్టుమని పదిరోజులైనా పుట్టింట్లోఉండ లేదు. తమ్ముణ్ణి చూసుకుని యుగాలైనట్టుంది, వాడు తన ప్రాణం. బుజ్జివెధవ దిగులుతో ఎలా ఉన్నాడో. తను వెళ్లాక వాడ్ని కాస్త చేరదీసి లాలనగా వాడి దృష్టి నాన్నమ్మ నుంచి మరల్చాలి. ఆడు కుంటూ, చదువుకుంటూ కన్నుల పండుగగా వాడు ఇంట్లోతిరుగాడితే తప్ప నాన్నకి మనశ్శాంతి ఉండదు. హడావిడిగా అప్పటి కప్పుడు తమ్ముడికిష్టమైన రసగుల్లా చేసింది సరస్వతి. ఇంట్లోకి అడుగుపెడుతూనే తమ్ముడికోసం తల్లిని అడిగింది.

"వాడి మాటెత్తకు. నాకు అరికాలిమంట నెత్తికెక్కుతుంది. ఆ చచ్చిన మీ నాన్నమ్మ కోసం తెగకొట్టుకు ఛస్తున్నాడు. ఆవిడ ఉండేదిగా ఆ గదిలోకి వెళ్ళిచూడు ఓ మూల కూర్చుని ఎలాఅఘోరిస్తున్నాడో" తల్లి మాటలకి సరస్వతి ముఖం కోపంతో ఎర్ర బడింది.

"అలా గుడ్లురిమి చూస్తావేం? మొన్ననోపరీక్ష తగలేశాడు. ఇవాళ వెళ్ళనేలేదు. ఈ ఏటి కేడాది చదువుకి సున్న పెట్టేటట్టు న్నాడు" అనేసి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

తల్లి ధోరణి సరస్వతికి చికాకు కలిగించింది. పసివెధవతో వంతం ఏమిటి. వాడిలా బెంగపడ్డాడు. కళ్లల్లో పెట్టుకొని చూసుకోవాల్సింది పోయి ఛీటికీ మాటికీ చిర్రుబుర్రులాడటమేమిటి? నెమ్మదిగా నాన్నమ్మ గదిలోకి నడిచింది. నిస్తేజంగా కూర్చున్న బుజ్జిగాడు అక్కరాకని గమనించలేదు.

"ఏరా తమ్మూ" అంటూ అక్కున చేర్చుకుంది.

"అక్కా నువ్వెప్పుడొచ్చావే?" వాడి కళ్లల్లో నీటి పొరలమధ్య రవ్వంత వెలుగు.

"ఇప్పుడే వచ్చానుకానీ ఏమిటిరా ఇలా కూర్చున్నావే. పరీక్షలటగా చదువుకోవడం లేదేం?"

పరీక్షల మాటెత్తగానే దుఃఖం ముంచుకొచ్చింది బుజ్జిగాడికి.

"ఏడుస్తావేంరా నాన్నా నేను నీకోసమే వచ్చేసాను. నువ్వు ఎంచక్కా చదువుకుంటే నువ్వు ఆడుకోడానికి బుజ్జి పాపాయిని ఇస్తాను. నువ్వు సరదాగా ఉండాలి" తమ్ముడి కళ్లు తుడుస్తూఅంది.
"కాదక్కా నాన్నమ్మ దేవుడి దగ్గరకు వెళ్ళిపోయిందిగా? నేనెలా బడికి వెళ్తాను. పరీక్షలెలా వ్రాస్తాను" వాడి మనోవేదన తండ్రి ముందు వెళ్ళగక్కబోతే తల్లి అడ్డుపడింది.

ఇప్పుడది అక్క ఒడిలో పెల్లుబికి వచ్చేసింది

"పిచ్చినాన్నా పెద్దవాళ్లు దేవుడి దగ్గరకు వెళ్ళిపోతే ఇలా ఏడవకూడదురా?"

"ఔనక్కా నాన్నమ్మ దేవుడి దగ్గరకు వెళ్ళిపోతూ నాతో ఈ మాట చెప్పింది. కానీ మరెలా?"

సరస్వతి ఆలోచనలు ఓ కొలిక్కి వచ్చాయి. పసివాడి మనస్సులో బాధ అర్థం అయ్యాక తను తెచ్చిన రసగుల్లా బుజ్జిగాడి ముందుంచి ఇవి తింటూ ఉండరా? నీకోమంచి కబురు చెప్తాను" అంటూ తండ్రి దగ్గరకి పరిగెత్తింది.

పేపరు తిరగేస్తున్నాడు అర్జునరావు. "నాన్నా మీరు అర్జంటుగా పావుకిలో పటికబెల్లం పట్టుకురండి. ఇక్కడున్నట్టు వచ్చెయ్యాలి మరి"

కూతురి కోరిక వింతగా తోచిందతనికి.

"పటికబెల్లం కోసం ఇంత కంగారెందుకమ్మా అయినా ఇప్పుడెందుకు?"

"కావాలి నాన్నా మీకంతా తర్వాత చెప్తాను. నేను చెప్పినట్టు చెయ్యండి" కూతురి మాటకి నవ్వుకుంటూ లేచి వెళ్ళిన అర్జునరావు పది నిమిషాల్లోనే పటికబెల్లంతో ప్రత్యక్షమయ్యాడు. దాన్ని చిన్న చిన్న ముక్కలుగా చేసి ఓ సీసాలో వేసింది. విస్మయంగా అర్జునరావుతో "మీరూ ఇలా రండి నాన్నా" అంటూ బుజ్జిగాడి వైపు దారి తీసింది. విషయం అర్థంకాని అతను కూతుర్ని అనుసరించాడు. అక్క లాలనతో నిద్రలోకి జారిపోయాడు బుజ్జిగాడు. ఆప్యాయంగా తమ్ముణ్ణి లేపి కూర్చోబెట్టింది. సీసాలో పటిక బెల్లం తమ్ముడికి చూపిస్తూ "ఇదిగోరా నాన్నమ్మ నీకిమ్మని నాకిచ్చింది. రోజూ బడికి వెళ్ళేముందు నాన్నమ్మ నీకు చేతిలోవేసే ప్రసాదం. మా ఊరొచ్చినప్పుడు నాకిచ్చి తను దేవుడి దగ్గరికి వెళ్ళిపోయాక నీకిచ్చేయమంది".

ఆరాటంగా అక్క చేతిలోని సీసా తీసుకుని ఓ ముక్క కళ్ళ

కద్దుకుని నోటిలో వేసుకున్నాడు.

"థాంక్యూ అక్కా థాంక్యూ రేపటి నుంచీ నేను పరీక్షలు బాగా వ్రాసేస్తాను" బుజ్జిగాడి ముఖం వెలిగిపోతోంది.

అప్పటికి అర్జునరావుకి విషయం ఏమిటో అర్థం అయింది. బుజ్జిగాడు పుస్తకాలు తెరిచి చదువుకోసాగాడు.

"వాడి మనస్సులో మాట ఎలా తెలుసుకోగలిగావమ్మా" అడిగాడు అర్జునరావు.

"ఏముంది నాన్నా పసిపిల్లల మనోభావాలు పసికట్టడానికి కావలసింది ఓర్పు, నేర్పు. నాన్నమ్మ మీది కోపాన్ని, విసుగుని పక్కకు పెట్టి నెమ్మదిగా అడిగితే విషయం అమ్మకే చెప్పేసేవాడు.

"నిజమే తల్లీ ఓ సమస్యవచ్చినప్పుడు అందుకు కారణం ఎవరో అని తన తప్పిదం, బాధ్యత లేనేలేవని పరిష్కారం ఆలోచించడం మాని వాళ్ళని నిందించుకుంటూ గోరంతలు, కొండంతలు చేసుకునే స్వభావమే చాలా మందిలో కనిపిస్తుంది. నువ్వు ఇంత సునిశితంగా ఆలోచించి తమ్ముడి బాధకి ఉపశమనం కలిగించావు" కూతురి కళ్లల్లోకి ఆప్యాయంగా చూశాడు. చదువులో నిండుగా మునిగిపోయిన తమ్ముణ్ణి చూసుకుని "ప్రసాదం రూపంలో భగవంతునికి నివేదన చేయబడే పటిక బెల్లం ఎంతపనిచేసింది. తనకి వెంటనే మంచి ఆలోచన తోచింది కనుక బుజ్జిగాడి దృష్టి చదువుపైకి మళ్ళింది. నాన్న మనఃస్తాపాన్ని పోగొట్టగలిగింది. నాన్నమ్మ భయభక్తులు రంగరించి వాడిలో నాటిన ఆధ్యాత్మిక బీజాలు మొలకెత్తి ఫలించి మంచితనం పెంచుకుని నాన్నమ్మ ఆశించిన త్రోవలోనే నడుస్తాడు. పటిక బెల్లం కిటుకు తనకి తెలిసిపోయిందిగా" నవ్వుకుంది సరస్వతి. ●